సాక్షి నిర్మల్
శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



సరస్వతి కాల్వకు తప్పిన ప్రమాదం

లక్ష్మణచాంద మండలంలో ప్రవహిస్తున్న సరస్వతి కాలువకు పెను ప్రమాదం తప్పింది. పరిమితికి మించి నీరు రావడంతో వడ్యాల్, బాబాపూర్ గ్రామాల వద్ద ప్రమాదకరంగా ప్రవహించింది. 10లో▸



తెరపైకి కొత్త ఎంపీపీ..?

భైంసా మండల అధ్యక్ష పదవికి కొత్తపేరు వినిపిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో మండల రాజకీయం మారిపోయింది. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.4 /16.3

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తగ్గుతాయి. రాత్రి మంచు ఎక్కువగా కురుస్తుంది. వేకువజామున పొంగమంచు ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఫోన్ల అప్పగింత



ఫోన్లు అందుకున్న బాధితులతో ఎస్పీ, ఏఎస్పీ

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోతే ఆందోళన వద్దని, పోలీస్ స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 37 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఎస్పీ బాధితులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్, ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



జెండా ఎగురవేస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ హయాంలోనే దేశాభివృద్ధి జరిగిందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ 138 ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీహరిరావు క్యాంప్ కార్యాలయంలో గురువారం వేడుకలు నిర్వహించారు. శ్రీహరిరావు పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకు వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ అవతరించిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలకు వెళ్లారు.

నేడు జాబ్ మేళా

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి జి.రాములు తెలిపారు. ఆదర్శ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వివిధ కేటగిరీలలో 135 పోస్టులు భైంసా, నిర్మల్‌లో ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు జిల్లా కేంద్రంలోని పొద్దుటూరి కాంప్లెక్స్‌లో ఉన్న పాత ఎల్‌బీసీ భవనలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఉదయం 10 గంటలలోపు అన్ని అర్హత పత్రాలతో హాజరుకావాలని వివరించారు.

‘ఉద్యమకారులకు ఇంటిస్థలంపై హర్షం

భైంసాటౌన్: ఇందిరమ్మ పథకంలో భాగంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలనలో స్వీకరిస్తున్న దరఖాస్తుల్లో ఉద్యమకారులకు స్థలం కేటాయింపు కోసం ప్రత్యేకంగా కాలమ్ ఉందని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అర్హులైన ఉద్యమకారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9440152454 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.



అమిత్‌షాను కలిసిన ఎమ్మెల్యేలు

నిర్మల్: హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన బీజేపీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరయ్యారు. ఆయనను నిర్మల్, ముథోల్ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్ కలిశారు.



ఈ ఏడు.. నిమ్మలం



- తగ్గిన మొత్తం కేసులు
- మహిళలపై పెరిగిన దాడులు
- గణనీయంగా మిస్సింగ్‌లు
- డయల్ 100కు పెరిగిన కాల్స్
- ట్రిపుల్‌ఐటీలో మరణమృదంగం

నిర్మల్: గడిచిన రెండేళ్లతో పోలిస్తే జిల్లా ఈ ఏడాది కాస్త నిమ్మలంగా ఉంది. 2023 ప్రశాంతంగా దాదాపు ముగియనుంది. పోలీసులు పక్కాగా వ్యవహరించడం, మొత్తంగా నమోదైన కేసుల సంఖ్యను పరిశీలిస్తే.. శాంతిభద్రతల పరంగా మెరుగ్గానే కనిపిస్తోంది. 2022లో 3,120 కేసులు నమోదుకాగా, 2023లో 2,967 కేసులు నమోదైనట్లు వార్షిక సమీక్ష సమావేశంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. పోలీసుల చెప్పిన లెక్కల ప్రకారం పరిశీలిస్తే.. ఈ ఏడాదిలో ఆడవాళ్లపై దాడులు, దూషణలు పెరిగాయి. ప్రధానంగా భార్యలపై భర్తలు చేసిన వేధింపుల సంఖ్య గత ఏడాదికంటే పెరిగింది. బాసర ట్రిపుల్‌ఐటీలో ఈఏడాది ఆరుగురు విద్యార్థులు చనిపోయారు. మొత్తం మీద పరిశీలిస్తే.. అసెంబ్లీ ఎన్నికలు ఉన్నప్పటికీ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా పోలీసులు చర్యలు చేపట్టి భేష్.. అనిపించుకున్నారు.

మహిళలపై దాడులు..

మహిళలు అధికంగా ఉండే జిల్లాలో వాళ్లపైనే దాడులు పెరుగుతున్నాయి. ఈవ్‌టీజింగ్, లైంగికదాడులతోపాటు దూషణలు ఈ ఏడాది కూడా కొనసాగడం చర్చనీయాంశం. గతేడాది 17 లైంగికదాడులు జరిగితే, ఈసారి 16 నమోదయ్యాయి. ఈవ్‌టీజింగ్ కేసులు ఈసారి కూడా నమోదు చేశారు. స్త్రీలను అవమానపర్చిన ఘటనలు గణనీయంగా పెరిగాయి. గత ఏడాది 47 ఉంటే, ఈసారి ఏకంగా 63కు పెరిగాయి. షీటీమ్ కేసులూ తక్కువేం లేవు. పోయినసారి 19 ఉంటే ఈఏడాదిలో 65 నమోదయ్యాయి. మిస్సింగ్ కేసులు గతేడాది 219 ఉండగా, ఈసారి రెంట్టింపు కన్నా పెరిగాయి ఏకంగా 436 మంది కనిపించకుండా పోయారు. అయితే ఇందులో 89 శాతం మిస్ అయినవాళ్లను అప్పగించినట్లు పోలీసులు వెల్లడించింది. మరోవైపు ఈఏడాది ఏకంగా 16,653 మంది జిల్లా వాసులు డయల్-100ద్వారా పోలీసుశాఖకు ఫిర్యాదులు చేయడం గమనార్హం.

గతేదాది, ఈ ఏడాది నమోదైన కేసుల వివరాలు..

కేసులు	2022	2023
గంజాయి	05	05
డ్రంకన్‌డ్రైవ్	8,452	7,632
మిస్సింగ్	215	219
సైబర్‌క్రైమ్	41	17
బెల్టుషాపులు	02	271
పోక్సో	24	18
ఎస్సీఎస్టీలపై నేరాలు	12	13
పేకాట	63	98
మట్కా	09	04
గుట్కా	04	00
హత్యలు	13	7
ఆస్తికోసం హత్య	02	00
అపహరణలు	34	35
అత్యాచారాలు	17	17
తీవ్రమైన కేసులు	58	40
సాధారణ కేసులు	3,602	2,957
మొత్తం కేసులు	3,120	2,967

భర్తలు వేధిస్తున్నారని..

ఏడాదిలో గృహహింస కేసుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. భర్తలు వేధిస్తున్నారంటూ గతేడాది 113 మంది కేసులు పెట్టగా, ఈఏడాది 121 మంది కేసులు పెట్టారు. ఇందులో వరకట్నం కోసం వేధించిన ఘటనలూ ఉన్నాయి. వరకట్న వేధింపులతో గతేడాది ముగ్గురు చనిపోగా, ఈసారి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఇక ఆత్మహత్య చే సుకునేలా ప్రేరేపించడంతో గతేడాదిలాగే ఈసారి కూడా 11 మంది ప్రాణాలు వదిలారు. భార్య ఉండగానే ఈసారి కూడా ఏడుగురు రెండో పెళ్లి చేసుకున్నారు.

పోలీసులు భేష్..

గత రెండేళ్లపాటు క్రైమ్‌రేట్ పెరగడం, భైంసాలో అల్లరు, విపరీతంగా రోడ్డుప్రమాదాలు చోటుచేసుకోవడం, గంజాయి, ఇతరత్రా కేసులు గణనీయంగా నమోదయ్యాయి. ఈఏడాది మాత్రం చాలావరకు క్రైమ్‌రేట్‌ను పోలీస్‌శాఖ కంట్రోల్ చేసింది. ఎప్పటికప్పుడు కేసుల నమోదుతోపాటు నేరస్థులకు శిక్షపడేలా చేయడంలో సఫలీకృతులయ్యారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, వినాయక నవరాత్రులు, రంజాన్, బక్రీద్ పర్వదినాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు శ్రమించారు. ప్రత్యేకంగా ట్రాఫిక్ స్టేషన్ లేకున్నా.. జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు కృషిచేశారు. వివిధ నేరాలు, ఘటనల నియంత్రణలో సోన్ స్టేషన్ ఉత్తమ పురస్కారం అందుకుంది. శాఖాపరంగా ఆదాయాన్ని పెంచుకునేందుకు జిల్లాకేంద్రంలో వన్‌టౌన్‌లో పోలీస్ క్యాంటీన్‌ను, రూరల్ స్టేషన్ పక్కన పెట్రోల్‌బంక్‌ను ఏర్పాటు చేశారు.

ట్రిపుల్‌ఐటీలో మరణమృదంగం..

ఏడాదికాలంలోనూ జిల్లాలో అడపదడపా క్రైమ్ ఘటనలు చోటు చేసుకున్నాయి. గత ఏడాది 260 రోడ్డుప్రమాదాలు చోటుచేసుకోగా, ఈసారి 214 జరిగాయి. ఇందులో 93 మంది ప్రాణాలు కోల్పోగా, 202 మంది క్షతగాత్రులయ్యారు. మొత్తం 1,96,225 వాహనాల తనిఖీలు చేసినా.. 7,632 డ్రంక్‌అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినా.. రోడ్డుప్రమాదాలు ఈఏడాదీ కొనసాగాయి. ఇక గతేడాది ఆందోళనలతో అట్టుడికిన బాసర ఆర్జీయూకేటీలో ఈసారి మరణమృదంగం మోగింది. ఏడాదికాలంలో ఏకంగా ఆరుగురు విద్యార్థులు తమ ఉసురు తీసుకున్నారు. ఇందులో జూన్‌లో రెండురోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది.

కొట్టేసిన ఫోన్లు పట్టిచ్చారు..

ఈఏడాదిలో పోలీస్‌శాఖ సాంకేతికతను అద్భుతంగా వినియోగించి భేష్ అనిపించుకుంది. దొంగలు కొట్టేసిన, పొరపాటు మర్చిపోయిన సెల్‌ఫోన్లను మళ్లీ బాధితులకు అందించారు. 2023లో పోలీసుశాఖ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్)ను ప్రారంభించి, ఇందులో జిల్లా రాష్ట్రంలోనే ముందుంది. ఈ ఏడాదిలో 1,563 సెల్‌ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు రాగా, మొత్తం ఫోన్లను ఈ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా బ్లాక్ చేశారు. ఇందులో ఏకంగా 990 సెల్‌ఫోన్లను పట్టుకుని, తిరిగి బాధితులకు అప్పగించారు.

ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



ప్రజాపాలన సభను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్

నిర్మల్‌టౌన్: ఆరు గ్యారంటీ పథకాల అమలే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అన్నారు. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 3, 4, 5 వార్డుల్లో గురువారం వార్డు సభలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ సభలను ప్రారంభించారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటి యజమాని పేరు, సామాజికవర్గం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్, వృత్తి, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు దరఖాస్తులో పేర్కొనాలన్నారు. దరఖాస్తు ముట్టినట్లుగా రశీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ రాజు, పట్టణ సీఐ పురుషోత్తం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లికే గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ సభను అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. దరఖాస్తుల సంఖ్యను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి శ్యామ్‌రావ్, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, ఎంపీవో నసీరుద్దీన్ పాల్గొన్నారు.

ఆధార్ కోసం అవస్థలు..!

- పలుచోట్ల మూతపడిన కేంద్రాలు
- ఆరు గ్యారెంటీల నేపథ్యంలో దరఖాస్తుదారుల్లో ఆందోళన



భైంసాలోని ఆధార్‌కేంద్రం వద్ద బారులు తీరిన దరఖాస్తుదారులు

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీలకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరి కావడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. రేషన్‌కార్డు లేనివారు, ఆధార్‌కార్డు లేనివారు, ఉన్నవాటిల్లో పేర్లు, ఇతర వివరాలు తప్పుగా ఉన్నవారు, కేవైసీ అప్‌డేట్ అవసరమైనవారు ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. మండల కేంద్రాల్లో ఆధార్ కేంద్రాలు మూతపడడంతో ఆయా మండలాల ప్రజలు సైతం ఆధార్‌కేంద్రం ఉన్న మండల కేంద్రానికి వెళుతున్నారు. తీరా అక్కడికి వెళ్లినా వందల మంది దరఖాస్తుదారులు క్యూలో ఉండడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు, చిన్నపిల్లలతో వచ్చిన మహిళలు, వృద్ధులు గంటలతరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి.

నాలుగు కేంద్రాలు మూసివేత..

జిల్లాలో 19 ఆధార్ నమోదు కేంద్రాలు ఉండగా, వీటిలో నాలుగు కేంద్రాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. ముథోల్, తానూరు, దిలావర్‌పూర్, కడెం మండల కేంద్రాల్లోని ఆధార్‌కేంద్రాల ఆపరేటర్ల ఐడీలు తాత్కాలికంగా బ్లాక్ అయ్యాయి. దీంతో ఆయా మండలాల ప్రజలు ఆధార్ కార్డు నమోదు, కేవైసీ వివరాల అప్‌డేట్ కోసం ఇతర మండలాలకు వెళ్తున్నారు. ముథోల్, తానూరు మండలాల దరఖాస్తుదారులు రెండురోజులుగా భైంసాలోని ఈసేవ కేంద్రంలోని ఆధార్ కేంద్రానికి వస్తునానరు. దరఖాస్తుదారులు అధిక సంఖ్యలో ఉండడంతో వారిని నిలువరించడం నిర్వాహకులకు ఇబ్బందిగా మారింది.

ఆరు గ్యారెంటీలతో ఆందోళన..

ఇదిలా ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం ఆరు గ్యా రెంటీల పథకాలకు అర్హుల ఎంపిక కోసం ప్ర జాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇందుకుగాను ఆధార్, రేషన్‌కా ర్డు తప్పనిసరి కావడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. వాస్తవానికి ప్రజాపాలనలో గృహలక్ష్మి(నెలకు రూ.2500, రూ.500 సిలిండర్), రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి(200 యూనిట్లలోపు ఉచిత వి ద్యుత్), చేయూత(దివ్యాంగులు, వృద్ధాప్య, గీత, చేనేత, వితంతు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, డయాలసిస్ బాధితులు, ఫైలేరియా, ఎయిడ్స్ బాధితులు) పథకాలకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందుకుగాను రేషన్ కార్డు నంబర్, ఆధార్‌కార్డు నంబర్, గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటర్ స ర్వీసు నంబర్, తదితర వివరాలు దరఖాస్తుఫారంలో పొందుపర్చాల్సి ఉంటుంది. కాగా, కొత్త రేషన్‌కార్డుల జారీకి ఎలాంటి దరఖాస్తులు స్వీకరించడం లేదు. ఇది తెలియక చాలా మంది రేషన్‌కార్డుల్లో తమ పిల్లల పేర్లు చేర్పించేందుకు కొత్తగా ఆధార్‌కార్డు కోసం కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అంతేగాక రూ.500లకే సిలిండర్ కేవైసీ చేయించుకోవాలని పుకార్లు వస్తుండడంతో సైతం జనాలు ఆధార్‌కార్డుల్లో తప్పుల సవరణకు ఎగబడుతున్నారు. ఫలితంగా ఆధార్‌కేంద్రాల వద్ద గందరగోళం నెలకొంటోంది.

ఐడీలు బ్లాక్ అయ్యాయి...

ముథోల్, తానూరు, దిలావర్‌పూర్, కడెం మండలాల్లోని ఆధార్ కేంద్రాల ఆపరేటర్ల ఐడీలు తాత్కాలికంగా డియాక్టివ్ చేశారు. భైంసాకు చెందిన ఓ ఆపరేటర్ ఐడీ కూడా ఆధార్ అథారిటీ అధికారులు బ్లాక్ చేశారు. దీంతో ఆయా మండల కేంద్రాల్లో ఆధార్ సేవలు అందడం లేదు. బ్లాక్ చేసిన ఐడీలు తెరిపించాలని విన్నవించాం. త్వరలోనే ఆయా కేంద్రాల్లో తిరిగి ఆధార్ సేవలు ప్రారంభిస్తాం. – నదీం, ఈడీఎం, నిర్మల్

‘విశ్వకర్మ’కు ప్రయోజనం పొందేందుకు..



ముథోల్‌లో ఆధార్‌కేంద్రం పనిచేయడం లేదు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద దరఖాస్తు చేసుకుందామంటే ఆధార్‌కార్డులో ఆదిలాబాద్ జిల్లా అని వచ్చింది. దీంతో దరఖాస్తు స్వీకరించడం లేదు. నిర్మల్ జిల్లాగా ఆధార్‌లో సవరిస్తేనే దరఖాస్తు చేసుకోవచ్చంటున్నారు. సవరణ కోసం ఉదయం 5 గంటల నుంచి వేచి ఉన్నా. – ముత్యం, ముథోల్

తానూరు నుంచి వచ్చాం...



మాది తానూర్ మండలం సింగన్‌గావ్. తానూరులో ఆధార్‌కేంద్రం పని చేయ డం లేదు. ఆధార్ అప్‌డేట్ కోసం భైంసాకు వచ్చాం. రెండు గంటల నుంచి క్యూలో నిల్చుని ఉన్నాం. తానూర్‌లో ఆధార్ కేంద్రం త్వరగా తెరిపించాలి.
– శారద, అల్కతాయి, సింగన్‌గావ్

కొత్త ఆధార్‌కార్డు కోసం...



పిల్లలకు ఆధార్ కోసం రెండు రోజులుగా భైంసాకు వస్తున్నా. ముథోల్‌లో ఆధార్‌కేంద్రం మూసి ఉండడంతో ఇక్కడికి రావాల్సి వస్తోంది. ఇక్కడ రోజుకు వందమందికి మాత్రమే టోకెన్లు ఇస్తున్నారు. మావంతు వచ్చేసరికి టోకెన్లు అయిపోతున్నయ్.
– షఫీ, రాళ్ల బోరిగాం

‘ప్రజాపాలన’కు పోటెత్తారు

- జిల్లాలో ప్రారంభమైన సభలు
- నిర్మల్‌లో ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్
- 64 గ్రామాలు, 11 వార్డులలో సభలు
- తొలి రోజు 17,194 దరఖాస్తుల స్వీకరణ



నిర్మల్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కౌన్సిలర్ అరవింద్

నిర్మల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన సభలు గురువారం జిల్లాలోనూ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పథకాల లబ్ధి పొందాలంటే దరఖాస్తులను అందించాలంటూ ప్రచారం సాగడంతో సభలకు సంబంధిత ప్రాంతాల ప్రజలు పోటెత్తారు. కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ పార్లమెంట్ ఎన్నికల శిక్షణ సెలవులో ఉండటంతో స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ ప్రారంభించారు. జిల్లాకేంద్రంలోని నాయిడివాడలో ఉదయం నిర్వహించిన వార్డుసభలో, నిర్మల్‌రూరల్ మండలం అక్కాపూర్ గ్రామసభలో పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారం పేర్కొన్న గ్రామాలు, మున్సిపాలిటీ వార్డులలో ఉదయం, మధ్యాహ్నం రెండుపూటలా సభలు నిర్వహించారు. దరఖాస్తులు స్వీకరించడంతోపాటు రశీదులు ఇవ్వాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు.

జిల్లాలో తొలిరోజు..

జిల్లాలో తొలిరోజు గ్రామాలు, పట్టణాల్లో వార్డులు కలిపి మొత్తం75 సభలు నిర్వహించారు. మొత్తం 396 గ్రామపంచాయతీలకు గానూ 64 చోట్ల నిర్వహించగా, మూడు మున్సిపాలిటీలలో కలిపి 11 వార్డుల్లో ప్రజాపాలన చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారులతోపాటు సభలకు కేటాయించిన ఇన్‌చార్జి అధికారులు పాల్గొన్నారు. సిబ్బంది సంబంధిత గ్రామాల, వార్డుల ప్రజల నుంచి అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులు తీసుకోవడం, వాటిని నింపడం, వరుసగా తెచ్చివ్వడం, రశీదులు తీసుకోవడం.. ఇలా సందడిగా సాగాయి.

అందరిలో సందేహాలు..

ప్రజాపాలనకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నప్పటికీ చాలామందిలో సందేహాలు వెల్లువెత్తాయి. ప్రధానంగా దరఖాస్తు పత్రంలో ఆధార్‌కార్డుతోపాటు తెల్లరేషన్‌కార్డు జిరాక్సును జతపర్చాలని అడిగారు. ఇందులో తెల్లరేషన్‌కార్డు లేనివారి పరిస్థితి ఏందన్న సందేహాలు చాలామంది వెలిబుచ్చారు. కేవలం ఆధార్‌కార్డు జిరాక్స్ పెడితే తమను పథకాలకు అర్హులను చేస్తారా.. లేదా.. అని ప్రశ్నల వర్షం కురిపించారు. చాలామంది ముందుగా తమకు తెల్లరేషన్ కార్డు కావాలని, దీనికి ఎలా దరఖాస్తు చేసుకోవాలని అడగటం కనిపించింది. గత ప్రభుత్వం నుంచి పింఛన్లు పొందుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవాలా.. అవసరం లేదా.. అంటూ ప్రశ్నించారు. సభలు లేని వార్డులు, గ్రామాల ప్రజలు దరఖాస్తుల కోసం ప్రజాపాలన కార్యక్రమాల వద్దకు వచ్చారు.

తొలిరోజు ప్రజాపాలన వివరాలు

సభలు చేపట్టిన గ్రామాలు	64
మున్సిపాలిటీల్లోని వార్డులు	11
సభల పరిధిలోని నివాసాలు	24,824
వచ్చిన మొత్తం దరఖాస్తులు	17,194

నేరాల నియంత్రణకు కృషి

- ఎస్పీ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: జిల్లాలో నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో 2023 వార్షిక నేర నివేదిక వివరాలు వెల్లడించారు. 2022తో పోల్చితే 2023లో ఐదు శాతం నేరాలు తగ్గాయని తెలిపారు. హెచ్‌ఆర్‌ఎంఎస్ అప్లికేషన్ ద్వారా ఈ సంవత్సరం ప్రతీ పనిని పేపర్‌లెస్ అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గంజాయి, బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ సిబ్బందిని ఆదేశించారు. బెట్టింగ్‌కు పాల్పడేవారి సమాచారం అందించాలని కోరారు. పోలీస్ సిబ్బందికి అందుబాటులో ఉండేందుకు పట్టణ పోలీస్ స్టేషన్ పక్కన సూపర్ మార్కెట్ నిర్మించామన్నారు. శుక్రవారం దీనిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్ పక్కన ప్రజలకు నాణ్యమైన పెట్రోల్ అందించే దిశగా ఫ్యూయల్ స్టేషన్ నిర్మించామని, త్వరలో దానిని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. నిర్మల్‌లో ట్రాన్స్ జెండర్ల ఇబ్బంది ఎక్కువవుతుందని తమ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్, అదనపు ఎస్పీ వీరన్న, డీఎస్పీ గంగారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ పురుషోత్తం, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సిద్ధం కావాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ ఖిల్లా: జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ మేళాకు జిల్లాలోని ఆయా యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలన్నీ సిద్ధం కావాలని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి జిల్లాస్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. గతేడాది ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన పాఠశాలలు తమ ఎగ్జిబిట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శన కోసం ప్రతీ పాఠశాల నుంచి ఒక అంశం చొప్పున ఐదు అంశాల్లో ప్రదర్శనను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఆరోగ్యం, పర్యావరణ జీవన విధానం, వ్య వసాయం, రవాణా– కమ్యూనికేషన్, గణాంక ఆలోచన విభాగాల్లో ప్రదర్శనలు ఉండాలని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు, గురుకులాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు ప్రాజెక్టులు సన్నద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. జనవరి 18, 19 తేదీలలో ఈ ప్రాజెక్టుల మూల్యాంకనం ఉంటుందని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్‌ను 94400 69830 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

నిజామాబాద్‌లో బాలికల ఆచూకీ లభ్యం

- సెల్‌ఫోన్ చూడడంతో తల్లిదండ్రుల మందలింపు
- ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థినులు

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్)/ఆదిలాబాద్‌రూరల్: తరచూ సెల్‌ఫోన్ చూస్తున్నారని తల్లిదండ్రులు మందలించడంతో ఆదిలాబాద్‌లోని ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికల ఆచూకీ నిజామాబాద్‌లో లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ధోబీ కాలనీకి చెందిన నలుగురు బాలికలు సరస్వతినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. తరచూ ఫోన్‌లో ఇన్‌స్టాగ్రాం చూస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. బుధవారం స్కూల్‌కు వెళ్తున్నామని చెప్పి వెళ్లిన బాలికలు సాయంత్రం 6 గంటలైనా తిరిగి రాలేదు. తల్లిదండ్రులు మావల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆదిలాబాద్ బస్టాండ్‌లో సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించారు. నిజామాబాద్ బస్సు ఎక్కినట్లు గుర్తించారు. తల్లిదండ్రుల సెల్‌ఫోన్లలో ఇన్‌స్టాగ్రాంలో వాయిస్ ఆధారంగా నిజామాబాద్ వచ్చినట్లు గుర్తించి ఇక్కడి పోలీసులకు సమాచారం అందించారు. నిజామాబాద్ పోలీసులు అర్ధరాత్రి బస్టాండ్‌కు చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. మావల పోలీసులకు బాలికలను గురువారం అప్పగించారు. వీరు ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన వారి కోసం నిజామాబాద్‌కు వచ్చినట్లు సమాచారం.

నర్సింగ్ విద్యార్థిని మృతి


సంజన(ఫైల్)

సోన్: సోన్ మండలం మాధాపూర్ గ్రామానికి చెందిన పడిగెల పోశెట్టి, రాధ దంపతుల కూతురు సంజన (21) గురువారం మృతిచెందింది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజన బాన్సువాడలోని నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. గత కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వారం రోజులుగా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది.

తరుణ్ చుగ్‌ను కలిసిన నాయకులు


తరుణ్‌చుగ్‌తో జిల్లా నాయకులు

కుంటాల: బీజేపీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం హైదరాబాద్‌లో గురువారం నిర్వహించారు. కేంద్రం హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్‌ను భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు, మాజీ ఎంపీపీ అరుణా రమణారావు కలిశారు.

లారీ నుంచి కిందపడి ఒకరి మృతి

భైంసారూరల్: ప్రమాదవశాత్తు లారీపై నుంచి పడి హమాలీ గాయక్‌వాడ్ ఉత్తం(56) మృతిచెందినట్లు భైంసారూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ... భైంసా పట్టణానికి చెందిన గాయక్‌వాడ్ ఉత్తం గురువారం భైంసా – బాసర రోడ్డులోని రాణీ జిన్నింగ్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు వెళ్లాడు. బేల్స్ దించుతుండగా ప్రమాదవశాత్తు లారీలో నుంచి కిందపడిమృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

సరస్వతి కాల్వకు తప్పిన ప్రమాదం

- పరిమితికి మించి నీటి విడుదల
- వడ్యాల్ సమీపంలో కోతకు గురైన కాలువ
- సకాలంలో స్పందించిన ఇరిగేషన్ అధికారులు
- తప్పిన పెను ముప్పు


నిండుగా ప్రవహిస్తున్న సరస్వతి కాలువ

లక్ష్మణచాంద: మండలంలో ప్రవహిస్తున్న సరస్వతి కాలువకు పెను ప్రమాదం తప్పింది. బుధవారం మధ్యాహ్నం సరస్వతి కాలువకు పరిమితికి మించి నీరు విడుదల చేయడంతో మండలంలోని వడ్యాల్, బాబాపూర్ గ్రామాల వద్ద ప్రమాదకరంగా ప్రవహించింది. గురువారం ఉదయం అటువైపు వెళ్లిన వడ్యాల్ గ్రామస్తులకు ఎస్కేప్ కెనాల్ వద్ద ఎప్పుడు ఎత్తే మోతాదులోనే గేటు ఎత్తడంతో గేటు పైనుంచి కాలువ గట్టు నుంచి నీరు ప్రవహిస్తూ కనిపించింది. దీంతో గమనించిన రైతులు వెంటనే ఇరిగేషన్ అధికారులకు తెలియజేశారు. దీంతో వెంటనే స్పందించిన ఇరిగేషన్ డీఈ నరేష్, ఏఈ మధుకర్‌రెడ్డిలు హుటాహుటిన వడ్యాల్ గ్రామ సమీపంలోని సరస్వతి కాలువను పరిశీలించారు. కాలువ ప్రమాదకరంగా పారుతుండడంతో వెంటనే శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ అధికారులతో మాట్లాడి కాలువకు నీటిమట్టం తగ్గించారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. లేదంటే సరస్వతి కాలువకు పలుచోట్ల పెద్ద ఎత్తున గండ్లు పడి పెను ప్రమాదమే సంభవించేదని మండల వాసులంటున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులను సంప్రదించగా సరస్వతి కాలువకు కేవలం 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని, కానీ గేటు మొరాయించడంతో సుమారు 1000 క్యూసెక్కుల నీటివరకు విడుదలైందని, దీంతో పరిమితికి మించి నీరు రావడంతో ఇలా జరిగిందని తెలిపారు. సకాలంలో స్పందించడంతో నీటి విడుదలను తగ్గించామని, దీంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు.


కోతకు గురైన కాలువను పరిశీలిస్తున్న డీఈ నరేష్

గిరిజనుల ఆరోగ్య స్థితిగతులపై దృష్టి సారించాలి

- సికిల్ సెల్ స్క్రీనింగ్ టెస్టులను ప్రారంభించిన ఐటీడీఏ పీవో


సికెల్ సెల్ స్క్రీనింగ్ ప్రారంభిస్తున్న పీఓ

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల ఆరోగ్య స్థితిగతులపై వైద్య శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం మండలంలోని కొలాంగూడ గ్రామంలో పీవీటీజీల కోసం సికెల్ సెల్ స్క్రీనింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ పీహెచ్‌లో పీవీటీజీలను టెస్ట్ చేయాలని, వివరాలు నమోదు చేయాలన్నారు. డివిజన్ పరిధిలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల్లోని 8 పీహెచ్‌సీలకు 23 టీంల ద్వారా సికెల్ సెల్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తామని వైద్యాధికారులు పేర్కొన్నారు. కొలాం ఆదివాసీ గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. గురువారం 8 పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 605 స్క్రీనింగ్ చేయడం జరిగిందన్నారు. దంతనపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు అనురాధ, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఆశా వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఎమ్మెల్యే బొజ్జుకు వైద్యపరీక్షలు


రిమ్స్‌లో ఎమ్మెల్యే బొజ్జుకు వైద్య పరీక్షలు


బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఎదులాపురం: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ టైఫాయిడ్‌తో బాధపడుతున్న విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే అస్వస్థతకు గురై ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించినా.. మంత్రి సీతక్క గురువారం జిల్లాలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ హాజరయ్యారు. దీంతో మళ్లీ అస్వస్థతకు గురి కాగా గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో వైద్యపరీక్షలు చేయించుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పర్యవేక్షణలో సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించారు. పలు సూచనలు చేశారు.

బస్సులోనే మహారాష్ట్రకు..

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నిర్వహించగా గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక బస్సులో నాగ్‌పూర్‌కు వెళ్లారు. ఎమ్మెల్యే వెంట నాయకులు లింగంపల్లి, ఎక్బాల్, చంద్రయ్య, లాజర్, ఉమేర్, సులోచన తదితరులున్నారు.

నిర్మల్ ఐఎంఏ అధ్యక్షుడికి పురస్కారం


పురస్కారాన్ని అందుకుంటున్న రామకృష్ణ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) అధ్యక్షుడు డాక్టర్ ఉదయగిరి రామకృష్ణకు ఐఎంఏ జాతీయస్థాయి పురస్కారం లభించింది. గురువారం కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో నిర్వహించిన 9వ నేషనల్ ఐఎంఏ కాన్ఫరెన్స్‌లో భాగంగా డాక్టర్ రామకృష్ణ ప్రతిష్టాత్మక 'నేషనల్ ప్రెసిడెంట్ అప్రిషియేషన్ అవార్డు' అందుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగేళ్లుగా ఆయన అందిస్తున్న సామాజిక, వైద్యసేవలకు ఈ పురస్కారం లభించింది. ముఖ్యఅతిథి కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, జాతీయ ఐఎంఏ అధ్యక్షుడు శరత్‌కుమార్ అగర్వాల్, సంస్థ ప్రతినిధులు అశోక్ తదితరుల చేతుల మీదుగా పురస్కారం స్వీకరించారు. రామకృష్ణతోపాటు డాక్టర్ కే.బాలాజీ ఈ సదస్సుకు హాజరయ్యారు. జాతీయ స్థాయి పురస్కారం నిర్మల్ వైద్యుడికి లభించడంపై జిల్లాకు చెందిన సీనియర్ వైద్యులు చక్రధారి, దామెరరాములు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అదృశ్యమైన వ్యక్తి కోసం గాలింపు

ఇంద్రవెల్లి: ఈ నెల 26న ఇంద్రవెల్లి మండలంలోని కొబ్బయ్‌గూడ గ్రామ సమీపంలోని చెరువులో అదృశ్యమైన అంజి గ్రామానికి చెందిన గారుశే నాందేవ్ కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. నాందేవ్‌కు తోడుగా వెళ్లిన రమేష్, మారుతి, డిగంబర్‌లు ఇచ్చిన సమాచారం మేరకు చెరువు ఒడ్డుకు ఉన్న నాందేవ్ చెప్పులు, బట్టలను గుర్తించి గురువారం గాలింపు చేపట్టారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయి ఎంపికైన విద్యార్థులు

సోన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి సీహెచ్.వరుణ్, అభ్యాస గురుకులం 9వ తరగతి విద్యార్థి సీహెచ్.విగ్నేష్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–17 ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన తెలిపారు. హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ


అమ్మవారిని దర్శించుకున్న శ్రీనివాసన్

భైంసా: బాసర సరస్వతి అమ్మవారిని గురువారం ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసన్ కృష్ణన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు


గుడుంబా బట్టి వద్ద అధికారులు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామంలో గురువారం ఎక్సైజ్ అధికారులు గుడుంబా స్థావరాలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దాడుల్లో గ్రామానికి చెందిన సురేష్, యమునల వద్ద సుమారు 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవి తెలిపారు. అనంతరం గ్రామ శివారులో ప్లాస్టిక్ డ్రమ్ముల్లో పులియబెట్టిన 400లీటర్ల బెల్లం పానకాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు గుడుంబా బట్టీని ధ్వంసం చేశారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

స్పుటం డబ్బాలు మోపించొద్దు

నిర్మల్‌చైన్‌గేట్: ఆశ వర్కర్లతో టీబీ స్పుటం డబ్బాలు మోపించొద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం పి.గంగమణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెమడ డబ్బాలు మోపించడం అనాగరిక చర్య అన్నారు. ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత కోసం కృషి చేయాలని కోరారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.గంగమణి మాట్లాడుతూ పెరిగిన పీఆర్సీ, ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, కరోనా రిస్క్ అలవెన్సు 16 నెలల బకాయిలు విడుదల చేయాలన్నారు. ఆశ వర్కర్ల జాబ్‌చార్ట్ విడుదల చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్‌కుమార్, ఆశ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సుజాత, భాగ్యలక్ష్మి, పద్మ, ఇంద్రమాల, సరిత, జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి ఉన్నారు.

ఆదాయం దిశగా పోలీస్‌శాఖ అడుగులు

- జిల్లా కేంద్రంలో పోలీస్‌వారి సూపర్ మార్కెట్, పెట్రోల్ బంక్
- నేడు ప్రారంభం కానున్న సూపర్ మార్కెట్


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పోలీస్ సూపర్ మార్కెట్

నిర్మల్‌టౌన్: నిర్మల్ పోలీస్‌శాఖ ఆదాయం దిశగా అడుగులు వేస్తోంది. శాంతి భద్రతలను కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న పోలీస్‌శాఖ వ్యాపార రంగంలోకి అడుగు పెట్టబోతోంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీస్‌శాఖ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసింది. స్థానిక డీఎస్పీ కార్యాలయానికి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఈ బంక్ నిర్మాణం పనులు పూర్తి కానున్నాయి. ఈ పెట్రోల్ బంకు నిర్వహణకు పోలీస్ శాఖ పర్యవేక్షించనుండగా పనిచేసే సిబ్బందిని మాత్రం అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించనున్నారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీస్‌శాఖ అభివృద్ధికి వినియోగించనుంది.

నేడు సూపర్ మార్కెట్ ప్రారంభం

జిల్లా కేంద్రంలో పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్ ఈ నెల 29న ప్రారంభం కానుంది. సూపర్ మార్కెట్‌ను పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కన నిర్మించారు. ఇందులో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచనున్నారు. ఇందులో పోలీస్ సిబ్బంది మాత్రమే కొనుగోలు చేయవచ్చు. ఇందులో దొరికే వస్తువులకు ట్రాన్స్‌పోర్ట్, టాక్స్‌లు ఉండవు. ఈ సూపర్ మార్కెట్లో సిబ్బంది ట్రైనింగ్ అయిన పోలీసులు ఉండనున్నారు.

మంత్రి సీతక్కకు వినతుల వెల్లువ


వినతిపత్రం ఇస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

కైలాస్‌నగర్: పదేళ్ల కాలంలోని పెండింగ్ బిల్లులు చెల్లించేలా చూడాలని బేల మండల సర్పంచ్‌లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను స్థానిక ప్రజాసేవ భవన్‌లో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే శాలువతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో సర్పంచ్‌లు ఆడే శంకర్, జంగ కేశవ్, సీతారాం, సంతోష్ ఉన్నారు.

అంగన్‌వాడీల వినతి..

మంత్రి సీతక్కను టీఎన్జీవోస్ అనుబంధ అంగన్‌వాడీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజాసేవ భవన్‌లో శాలువతో సత్కరించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో సంఘం నాయకులు కే.రాధ, కవిత, అనిత, సునంద, సుజాత, పొచ్చుబాయి ఉన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయండి

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఆదిలాబాద్‌కు వచ్చిన మంత్రి సీతక్కను బోథ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు కలిసి విన్నవించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి బోథ్‌ను డివిజన్‌గా చేస్తామని హామీ ఇచ్చారని మంత్రితో పేర్కొన్నారు. కార్యక్రమంలో చంటి, మహేందర్, అబూద్, గట్ల గంగాదర్, రాజశేఖర్ ఉన్నారు.

పోడు పట్టాదారుల సమస్యలు తీర్చాలి

ఎదులాపురం: పోడు పట్టాదారుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మంత్రి సీతక్కకు విన్నవించారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లాకు వచ్చిన మంత్రి సీపీఐ జిల్లా కార్యదర్శి కలిసి వినతి పత్రం అందజేశారు. అర్హులకు పోడుపట్టాలు ఇప్పించాలని కోరారు. సీసీఐని పునః ప్రారంభిస్తే 5 వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని కోరారు.

బడి బయట పిల్లల గుర్తింపు


పీచరలో ఇటుక బట్టీల వద్ద పిల్లలతో సీఆర్పీ

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో బడి బయట పిల్లలను సీఆర్పీలు సుధాకర్, మహేందర్ గుర్తించారు. గురువారం మండలంలోని పీచర గ్రామ పంచాయతీ పరిధిలో ఇటుక బట్టీల వద్ద వలస కూలీల పిల్లలను ముగ్గురిని సీఆర్పీలు గుర్తించారు. అలాగే మండలంలోని ధర్మారం గ్రామంలో వినికిడి లోపం గల ఇద్దరు పిల్లలను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే సర్వేలో భాగంగా 6 నుంచి 14 ఏళ్ల బాల, బాలికలను, 6 నుంచి 18 ఏళ్ల శారీరక, మానసిక వైకల్య లక్షణాలను కలిగిన బాల బాలికలను గుర్తించి వారి లోపాలకనుగుణంగా ఉపకరణాలు అందించడం జరుగుతుందన్నారు. శారీరక అంగవైకల్యం కలిగిన బాల బాలికల వీల్ చైర్స్, వినికిడి లోపం గల విద్యార్థులకు హియరింగ్ మిషన్స్, 10 ఏళ్ల పైబడిన బాలికలు బడిబయట గుర్తించి వారిని దగ్గరలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ఇందులో సీఆర్పీలు సుధాకర్, మహేందర్ ఉన్నారు.

పంచాయతీ గదిలోనే బతుకమ్మ చీరలు

- పంపిణీ చేయని క్రీడా సామగ్రి


గదిలో చీరలు, క్రీడల కిట్లు

ఖానాపూర్: గత ప్రభుత్వం ఏటా బతుకమ్మ పర్వదినం సందర్భంగా మహిళలకు పంపిణీ చేసే చీరలతో పాటు యువకులకు అందజేసే క్రీడా సామగ్రి నేటికీ పూర్తిస్థాయిలో పంపిణీ చేయకపోవడంతో దుమ్ముధూళితో పంచాయతీ గదుల్లోనే మూలనపడ్డాయి. గురువారం మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో ప్రజాపాలన సభలో దరఖాస్తు చేసేందుకు వచ్చిన గ్రామస్తులు వాటిని పరిశీలించి విస్మయం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నికల కోడ్ పేరుతో పూర్తిస్థాయిలో పంపిణీ చేయకుండా మధ్యలోనే ఆపివేసిన అధికారులు కోడ్ ముగిసి నెల రోజులు కావస్తున్నా.. ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. బతుకమ్మ చీరలతో పాటు క్రీడాకిట్లు సైతం పంచాయతీ భవనంలోని ఓ గదిలో నిల్వ ఉన్నాయి. పంపిణీలో జాప్యంపై ఉన్నతాధికారులతో విచారణ చేయాలని గ్రామస్తులు తోకల బుచ్చన్న, బక్కశెట్టి వెంకట్‌రాములు, తదితరులు డిమాండ్ చేశారు.

బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి నిర్మల్ న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన విరాల ప్రకారం... సారంగపూర్ మండలంలోని కంకట గ్రామానికి చెందిన భురారి మల్లయ్య కుమారుడైన వెంకటరమణ 20నెలలు బాలుడు. మే8, 2014న ఇంటి బయట ఆడుకుంటున్నాడు. తాంద్ర గ్రామానికి చెందిన సట్ల రాజశేఖర్ తన ఆటోతో అతివేగంగా నడుపుకుంటూ వచ్చి బాలుడిని ఢీకొన్నాడు. బాలుడి తలకు బలమైన గాయం కావడంతో 108 అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్తుండగా.. మార్గంమధ్యలో మృతిచెందాడు. దీంతో తండ్రి భురారి మల్లయ్య సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై జి.మల్లేష్ కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచాడు. ఏపీపీవో జి.రామకృష్ణ తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశాడు. ఈ మేరకు సట్ల రాజశేఖర్‌కు తొమ్మిది నెలల సాధారణ జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్‌కుమార్ తీర్పునిచ్చారు.

మల్లికార్జున్ ఖర్గేకు స్వాగతం


స్వాగతం పలుకుతున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖార్గేకు మహారాష్ట్రలోని నాగపూర్ ఎయిర్ పోర్ట్‌లో నిర్మల్ డీసీసీ అధ్యక్షులు, పార్టీ ఆవిర్భావ వేడుకల సభ్యులు కూచాడి శ్రీహరిరావు గురువారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు.